సద్వినియోగం చేసుకోవాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- మెట్‌పల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మెట్‌పల్లిరూరల్: మెట్లచిట్టాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 10: ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మండలంలోని రామలచ్చక్కపేట, ఆత్మనగర్, ఆత్మకూర్, మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే రైతులు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో దీపిక, ఏపీఎం విమోచన, మెట్లచిట్టాపూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు కేసిరెడ్డి నవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోపిడి జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు మారు సాయిరెడ్డి, పాలెపు నీల, మాజీ సర్పంచులు చౌట్‌పల్లి లావణ్య, బద్దం శేఖర్, ఆకుల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు బాగా లేదు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 10: ఇరిగేషన్ అధికారుల పనితీరు బాగా లేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మండిపడ్డారు. గురువారం కోరుట్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో చెరువులు, కుంటలకు వేసవికాలంలో చేయాల్సిన మరమ్మతులను ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. వేసవిలో పనులు పూర్తి చేస్తే వర్షాకాలంలో నీరు నిల్వ ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోతున్నాయని.. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పరిస్థితి అస్యవస్థంగా ఉందని, ఇప్పటికైనా అధికారులు తమ పనితీరు మార్చుకొని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడిని నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు వివిధ అధికారుల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సన్నాహక సమావేశానికి తరలిరావాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, పక్కన నాయకులు

పెగడపల్లి, ఏప్రిల్ 10: ధర్మపురిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు లోక మల్లారెడ్డి తెలిపారు. పెగడపల్లిలో గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జన సమీకరణపై సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్బీఎస్ మాజీ మండలాధ్యక్షుడు ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాశెట్టి సత్తయ్య, తాజీ మాజీ సర్పంచులు కోరుకంటి రాజేశ్వర్‌రావు, ఉప్పలంచ లక్ష్మణ్, నాయకులు మడిగెల తిరుపతి, బోగ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ స్థలం పరిశీలన

సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

జగిత్యాల, ఏప్రిల్ 10: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ స్థలాన్ని గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, సుదర్శన్, వినయ్ భాస్కర్, నాయకులు పరిశీలించారు. సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలి

సారంగాపూర్, ఏప్రిల్ 10: నర్సరీల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో చౌదరపు గంగాధర్ సూచించారు. కోనాపూర్‌లోని వన నర్సరీని గురువారం ఆయన పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అలాగే, గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేశ్, కారోబార్, అంగన్‌వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 10: మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో రెండు రోజుల క్రితం మృతి చెందిన అనాథ మృతదేహానికి మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకు గురువారం కార్మికులు అంత్యక్రియలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం సమీపంలో రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందిచడంతో మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించి, భద్రపర్చారు. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసుల సమక్షంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు అనాథ మృతదేహాన్ని ఖననం చేశారు.

బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

రాయికల్, ఏప్రిల్ 10: మండలంలోని తాట్లవాయిలో గురువారం బీఆర్ఎస్ గ్రామ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు బర్కం మల్లేశ్, పట్టణ కో-ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు వినోద్, నాయకులు రాంచందర్ రావు, గంగాధర్ యాదవ్, మహేశ్, అంజిత్, తిరుపతి, లక్ష్మణ్ రావు, నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాస వేడుకలు

మల్లాపూర్/పెగడపల్లి/మెట్‌పల్లి రూరల్/సారంగాపూర్/కోరుట్ల రూరల్/మేడిపల్లి/కథలాపూర్/కోరుట్ల/కొడిమ్యాల, ఏప్రిల్ 10: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాస వేడుకలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలిచి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్, ఆర్బీఎస్ అధికారులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రేకుర్తి కంటి దవాఖాన వైద్యులు సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. 50 మందికి శస్త్ర చికిత్సలు అవసరం కాగా, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి దవాఖానకు తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్, కార్యదర్శి గుండ రాకేశ్, కోశాధికారి వేణుగోపాల్, గడ్డం శంకర్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, వెల్మల శ్రీనివాస్‌రావు, ఆల్‌రౌండర్ గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్

జగిత్యాల, ఏప్రిల్ 10: జగిత్యాల రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో నూతనంగా ప్రారంభమైన స్లాట్ బుకింగ్ పద్ధతి ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని కుందన్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ మొట్ట మొదటి స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్‌ను అప్పగించారు. నూతన విధానంలో టైం స్లాట్ బుక్ చేసుకున్న అరగంటలోపే మొత్తం రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగి విజయవంతంగా డాక్యుమెంట్ అందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ సుజాత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిఐజీ (స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్) రవీందర్ పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయిస్తే సభ్యత్వం రద్దు చేయాలి

జగిత్యాల, ఏప్రిల్ 10: పార్టీ ఫిరాయించిన వారి సభ్యత్వం రద్దు చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధిష్టానాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విధానాలను సమాజానికి తెలిపేందుకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాజ్యాంగ నైతిక విలువల గురించి తాను మాట్లాడితే ఎమ్మెల్యే సంజయ్ ఉలిక్కి పడడం ఎందుకో అర్థం కావడం లేదన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి

మెట్‌పల్లి, ఏప్రిల్ 10: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉచితంగా నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తయ్యరెడ్డి కోరారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల మినీ స్టేడియాలు, మల్యాల, ఎండపల్లి, మల్యాల మండలం తక్కళ్లపల్లి, మెట్‌పల్లి పట్టణం, బీర్‌పూర్, మెట్‌పల్లి మండలం వెల్లుల్ల, ఇబ్రహీంపట్నం, రాయికల్ మండలం కట్కాపూర్, జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరేళ్ల వయస్సు పైబడిన చిన్నారులు అర్హులని, ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ శిబిరానికొక కోచ్‌ను నియమించినట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 94400 41975లో సంప్రదించాలని కోరారు.

వెయ్యి కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలి

జగిత్యాల, ఏప్రిల్ 10: జగిత్యాల గాయత్రీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఈ ఏడాది వెయ్యి కోట్ల వ్యాపార టర్నోవర్‌కు చేరుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆకాంక్షించారు. గురువారం గాయత్రీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై, మాట్లాడారు. జగిత్యాల కేంద్రంగా ప్రస్థానాన్ని ప్రారంభించిన గాయత్రీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలకు విస్తరించడం ప్రశంసనీయమన్నారు. ఇక్కడ జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంకుమార్, గాయత్రీ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ సీఈవో వనమాల శ్రీనివాస్, జీఎం (అడ్మిన్) శ్రీలత, సూపరింటెండెంట్ బీ సుజాత, సిబ్బంది ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

సారంగాపూర్, ఏప్రిల్ 10: మండలంలోని రేచపల్లి గ్రామ శివారులో నిర్మించిన గండి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు రావాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని గురువారం గ్రామ యువత కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ. 20,016 అందజేశారు.

నేటి నుంచి హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు

భక్తుల కోసం లడ్డూలను ప్యాకింగ్ చేస్తున్న సేవాసమితి సభ్యులు

మల్యాల, ఏప్రిల్ 10: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రధాన ఆలయ ఆవరణతో పాటు పార్క్, గెస్ట్ హౌస్‌కు వెళ్లే దారి, ఆలయ వెనకాల గల ఖాళీ ప్రదేశం, బేతాళుడి గుడి పరిసరాలు, బస్టాండ్ ఎదుట ఖాళీ స్థలం, ఆలయ ముందు ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేయించారు. టికెట్ విక్రయ కేంద్రాలు, కేశఖండనం, మాల విరమణ, లడ్డూ పులిహోర విక్రయ కేంద్రాల వద్ద క్యూ లైన్లు, బారికేడ్లు నిర్మించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనాలకు సైతం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు పరిసరాల్లో 113 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూముకు అనుసంధానం చేశారు. ఎస్పీ అశోక్‌కుమార్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. దీక్షాపరులు, భక్తుల కోసం 3 లక్షల లడ్డూలు తయారు చేసి పెట్టారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఆలయ ఈవో శ్రీకాంత రావు, పర్యవేక్షకుడు నీల చంద్రశేఖర్, ఏఈ నాగరాజు, సీఐ నీలం రవి, ఎస్ఐ నరేశ్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

జయంత్యుత్సవ కమిటీ నియామకం

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు హనుమాన్ చిన్న జయంత్యుత్సవాల నిర్వహణకు దేవాదాయ, ధర్మాధాయ శాఖ కమిషనర్ శ్రీధర్ 12 మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీని నియమించారు. ఉత్సవ కమిటీ సభ్యుల పదవీ కాలం మూడు రోజుల కాలపరిమితికి గానూ నియమించారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా ఇప్ప శ్రీనివాస రెడ్డి, కర్ర బాపురెడ్డి, వేముల అంజయ్య, కంచర్ల లక్ష్మణాచారి, వెల్మ లక్ష్మారెడ్డి, సంత ప్రకాశ్‌రెడ్డి, జమలపూరి రాజేశ్వరీ, అనుమండ్ల అజయ్‌రెడ్డి, కొండూరి రాజేశ్, మామిడి దిలీప్, తడగొండ హన్మంతు, వరాల నర్సింగం నియమితులయ్యారు. అలాగే, కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఇప్ప శ్రీనివాసరెడ్డిని మిగతా సభ్యులు ఎన్నుకున్నారు.

బస్టాండ్‌ను పరిశీలించిన ఈడీ

జగిత్యాల, ఏప్రిల్ 10: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఈడీ సోలోమన్ గురువారం పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న ప్లాట్‌ఫాంలు, బస్టాండ్‌కు వచ్చే బస్సులు, ప్రయాణికుల సంఖ్య, సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్ఎం రాజు, డిపో మేనేజర్ కల్పన, డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

రాయికల్, ఏప్రిల్ 10: పట్టణంలో గోనె నర్సయ్యకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 10 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 10: జగిత్యాలలోని టీఆర్‌నగర్‌లో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో గురువారం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఎండీ యాసిర్ అనే వ్యక్తి వద్ద 145 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించి, కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుళ్లు వినోద్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 10: జగిత్యాల పట్టణంలో ఇటీవల వరుసగా దొంగతనాలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగను జగిత్యాల టౌన్ పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాలలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. చొప్పదండి మండలం రాగంపేటకు చెందిన బక్కశెట్టి కొమురయ్య అలియాస్ రేగుల అజయ్‌కుమార్‌ను చిన్నతనంలో తండ్రి వదిలివెళ్లిపోయాడు. దీంతో అతడి తల్లి మల్యాల మండలం రాజారంకు చెందిన మరో వ్యక్తిని పెళ్లి చేసుకొని కొడుకును తీసుకొని ఇక్కడకు వచ్చారు. కొద్ది రోజుల తర్వాత కొమురయ్య రాజారం నుంచి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనికి కుదిరాడు. కంపెనీ యజమాని వేతనం ఇవ్వకపోవడంతో లారీలోంచి డెక్కు(మ్యూజిక్ సిస్టం)ను దొంగిలించి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత దొంగతనమే వృత్తిగా చేసుకుని పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడి పలుమార్లు జైలు జీవితం గడిపాడు. వివాహం చేసుకున్న అనంతరం మకాంను మంచిర్యాల పట్టణానికి మార్చాడు. 2018 నుంచి 21 వరకు వరంగల్‌లోని సెంట్రల్ జైల్లో ఉండి విడుదలయ్యాడు. గత జనవరి నుంచి మార్చి 28 వరకు జగిత్యాల పట్టణంలో ఏడు ఇండ్లల్లో, కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 9న పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కొమురయ్యను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, అతడి వద్ద బంగారు ఆభరణాలు దొరికాయి. ఇటీవల జగిత్యాల పట్టణంతో పాటు కొడిమ్యాల మండలంలో ఎనిమిది చోరీలు చేసినట్లు అంగీకరించాడని, అతడి వద్ద నుంచి 26 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. మద్యం తాగి తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి అందినకాడికి దోచుకెళ్లడం అలవాటు అని తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకున్న జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు ఎల్లూరి కిరణ్, గీత, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుళ్లు మల్లేశం, జీవన్, సంతోష్, రాజిరెడ్డి, విశాల్, గంగాధర్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి, రివార్డులు అందజేశారు.

యాదవులంతా ఐక్యంగా ఉండాలి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 10: యాదవులంతా ఐక్యంగా ఉండాలని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. గుల్లపేట గ్రామంలో గురువారం ఆయన యాదవులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘ సభ్యత్వాలను నమోదు చేసి, రసీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సభ్యులు లింగం, మహేశ్, గంగన్న, గణవేని తిరుపతి, భూపతి, రంజిత్, గంగుల కొమురయ్య, రాజ కొమురయ్య, దానవేని మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర పొందాలి

కథలాపూర్, ఏప్రిల్ 10: సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. కథలాపూర్ మండలం చింతకుంట, ఊట్‌పల్లి, పెగ్గెర్ల, రాజారాంతండా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక బాపురెడ్డి మాట్లాడుతూ, ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, డైరెక్టర్లు కారపు గంగాధర్, వాకిటి రాజారెడ్డి, చెల్లపెల్లి అంజయ్య, ఏజీబీ మహేందర్, ముదాం శేఖర్, ఏజీబీ గణేశ్, వర్ధినేని నాగేశ్వర్‌రావు, బొడ్డు బాలు, శంకర్, రాజు, నర్సారెడ్డి, ప్రభాకర్, గంగారెడ్డి, మహేశ్, రాజం, మల్లయ్య పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

వెల్గటూర్, ఏప్రిల్ 10: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు కోరారు. పైడిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటకు సంబంధించిన కరపత్రాన్ని ముద్రించగా, గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు తులసి ఆగమయ్యతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్ బాబు, ఆపరేటర్ బొలిశెట్టి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

పెగడపల్లి, ఏప్రిల్ 10: పెగడపల్లి మండలం ఆరవల్లి గ్రామంలో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుందని, ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో శ్రీకాంత్, ఏఈవో పవన్, ఫీల్డ్ అధికారి శ్యాంసన్, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ హోమియోపతి దినోత్సవం

పెగడపల్లి, ఏప్రిల్ 10: మండలంలోని బతికపల్లి యునానీ దవాఖానలో గురువారం ప్రపంచ హోమియోపతి దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ సామ్యూల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యుడు వినయ్‌కుమార్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి శివకుమార్, ఫార్మాసిస్ట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 10: జగిత్యాలలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం వీవోఏ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం, మార్కెటింగ్ శాఖ జేడీ మల్లేశం, ఫైనాన్స్ డీపీఎం విజయభారతి మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, మరియా, శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్తవ్వ పాల్గొన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించాలి

కోరుట్ల, ఏప్రిల్ 10: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ గురువారం పట్టణంలోని కొత్తబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై గ్యాస్‌సిలిండర్‌తో నిరసన తెలిపారు. రహదారిపై కట్టెల పొయ్యిపై వంటావార్పు నిర్వహించి ఆందోళన చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మేడిపల్లి, ఏప్రిల్ 10: మేడిపల్లి మండలం కాచారం గ్రామంలో పానుగంటి సాయబు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా విలేజ్ టూ విలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ సర్పంచ్ చిట్యాల సురేశ్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు లింగారెడ్డి, ఆనంద్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ

కథలాపూర్, ఏప్రిల్ 10: కథలాపూర్‌లోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వ